క్లుప్తంగా

మోటార్‌సైకిల్ చోరీ కేసులో ఆరు నెలల జైలు

భీమవరం: వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మోటార్ సైకిల్ దొంగిలించిన కేసులో ముద్దాయికి 6 నెలల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారని పోలీసులు తెలిపారు. గత ఏడాది జరిగిన ఈ ఘటనపై ఎస్సై బి.కిరణ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నేరం రుజువు కావడంతో భీమవరానికి చెందిన బి.మోజేష్‌కు శిక్షను ఖరారు చేస్తూ ఏజేఎఫ్‌సీఎం న్యాయమూర్తి డి.ధనరాజు తీర్పును వెలువరించారు.

ఓటు ఆవశ్యకతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎలక్షన్ డీటీ రత్నకుమార్

ఉండి: ఓటు ఆవశ్యకతపై బీఎల్వోలు ప్రజలకు అవగాహన కల్పించాలని ఎలక్షన్ డీటీ ఎస్ రత్నకుమార్ అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని బీఎల్వోలకు 15వ జాతీయ ఓటరు దినోత్సవంపై అవగాహన కల్పించారు. ఈ నెల 25న జరిగే జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజల్లో ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించాలని, అర్హులను ఓటర్లుగా నమోదు చేయాలని సూచించారు. ఈనెల 25న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో ప్రతిజ్ఞ, ర్యాలీలు, ఫ్లె కార్డులను ప్రదర్శించాలన్నారు. ముగ్గుల పోటీలు నిర్వహించాలని సూచించారు.

వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి

వీరవాసరం: వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పాటించాలని సహాయ వ్యవసాయ అధికారి చల్లా శ్రీనివాస్ తెలిపారు. ఉండి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రమైన వీరవాసరంలోని పంట చేనును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి చేలల్లో పాత పంటకు సంబంధించిన వరి దుబ్బులు డికంపోజ్ కాకపోవడం వల్ల నూర్చిన 10, 15 రోజుల్లోనే వరి నాట్లు కుళ్లిపోయే అవకాశం ఉందని తెలిపారు. వరి నాటే ముందు చేలల్లో కచ్చితంగా డీకంపోజర్ అయ్యేవిధంగా మందులు వాడుకోవాలని సూచించారు. వారి వెంట మండల వ్యవసాయ అధికారి కె.బిన్ని బాబు ఉన్నారు.

సీబీసీఎన్‌సీ కార్యదర్శిగా జోసఫ్‌రాజు

ఆకివీడు: సీబీసీఎన్‌సీ రాష్ట్ర కార్యదర్శిగా గూడపాటి జోసఫ్‌రాజు మూడో సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైజాగ్‌లో నూతన కమిటీ ప్రమాణస్వీకారం చేసినట్టు జోసఫ్‌రాజు బుధవారం తెలిపారు. నూతన బోర్డు 2030 సంవత్సరం వరకు ఐదేళ్ల పాటు కొనసాగుతుందన్నారు.

ముమ్మరంగా రబీ సాగు పనులు

- 8 వేల 400 ఎకరాలకు శ్రీకారం
- త్వరితగతిన వరినాట్లు పూర్తి చేయాలంటున్న అధికారులు



తాడేరులో వరినాట్లు వేస్తున్న దృశ్యం



పొలాలను ట్రాక్టర్‌తో దమ్ములు చేస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: ఈ ఏడాది ఖరీఫ్‌లో గిట్టుబాటు కాని అన్నదాతలు గంపెడాశతో రబీ సాగుకు సన్నద్ధం అవుతున్నారు. మండలంలో యనమదుర్రు, దిరుసుమర్రు, తాడేరు, బేతపూడి, రాయలం, చినఅమిరం, కొవ్వాడ అన్నవరం, కొమరాడ తదితర గ్రామాలలో రబీ సాగును 8 వేల 400 ఎకరాల్లో చేయడానికి రైతులు సిద్ధమయ్యారు. ఇప్పటి వరకు 80 శాతం వరినాట్లు పూర్తి చేశారు. గత ఖరీఫ్‌లో అధిక వర్షాలు కారణంగా మురుగు డ్రైయిన్‌లు వర్షపు నీటి ప్రవాహం లాగకపోవడంతో కొన్ని చోట్ల వరినాట్లు కుళ్లిపోవడంతో సుమారు 3 వేల 400 ఎకరాలలో మాత్రమే సాగు చేపట్టారు. సాగు చివరిలో పంట కోతకు వచ్చే దశలో తుఫాన్‌లు, వర్షాలు వల్ల పంట దిగుబడులు ఎకరానికి 25 నుంచి 35 బస్తాలు మాత్రమే వచ్చాయి. దాంతో పెట్టుబడులు మాత్రమే దక్కాయి. అయితే ప్రస్తుతం వాతావరణం అనుకూలిస్తే రబీలో ఎకరానికి 50 నుంచి 60 బస్తాల దిగుబడులు వస్తాయని రైతులు దీమాగా రబీ పనులను ముమ్మరంగా చేపడుతున్నారు.

అందని సాయం

సాధారణంగా రబీలో వరి సాగుకు పెట్టుబడి కింద ఎకరానికి రూ.25 వేలు నుంచి రూ.30 వేల వరకూ అవుతుంది. నీటి ఎద్దడి లేకుండా వాతావరణం అనుకూలిస్తే దిగుబడులు 50 నుంచి 60 బస్తాల వరకూ రావచ్చని రైతులు లెక్కలు వేస్తున్నారు. ఇదే జరిగితే తమకు ఖరీఫ్‌లో వచ్చిన నష్టాలను అధిగమించి లాభాల బాట పట్టవచ్చనే దీమాగా ఉన్నారు. గత ప్రభుత్వంలో రైతు భరోసా ద్వారా పెట్టుబడి సాయం అందేది. దీంతో రైతులు సునాయసంగా పంటలో పెట్టుబడి పెట్టి సాగును గట్టెక్కించేవారు. ఈ ఏడాది ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయం అందకపోవడంతో కొందరు రైతులు దళారులను ఆశ్రయిస్తుండగా మరికొందరు అందిన కాడికి అధిక వడ్డీలకు అప్పులు చేసి దాళ్వా సాగు చేస్తున్నారు.

త్వరితగతిన నాట్లు పూర్తి చేయాలి



ఇప్పటివరకు దాళ్వా సాగుకు సంబంధించి 80 శాతం వరినాట్లు పూర్తి చేశారు. మిగిలిన రైతులు త్వరితగతిన వరి నాట్లు పూర్తి చేయాలి. ఆలస్యమైతే పంట కోతకు వచ్చే దశలో మార్చి, ఏప్రిల్‌లలో నీటి ఎద్దడి వస్తే పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. వ్యవసాయాధిరిత గ్రామాలలోని రైతు సేవా కేంద్రాల్లో 100 టన్నులు యూరియా అందుబాటులో ఉంచాం. రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– నిమ్మల శ్రీనివాస్, వ్యవసాయాధికారి, భీమవరం మండలం

అందుబాటులో ఎరువులు

భీమవరం మండలంలో రబీ దాళ్వా సాగుకు సంబంధించి రైతు సేవా కేంద్రాల్లో సుమారు 100 టన్నులు యూరియా అందుబాటులో ఉంచారు. అంతేకాకుండా సొసైటీల్లో కూడా ఎరువులను ఉంచినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు.

26న భీమవరంలో ఉచిత క్యాన్సర్ శిబిరం



భీమవరంలో ఉచిత వైద్య శిబిరం పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలోని ఉద్దరాజు ఆనందరాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదిన ఆనంద ఫంక్షన్ హాల్లో మెగా ఉచిత వైద్య శిబిరం, ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షాశిబిరం, ఉచిత చర్మ సంబంధిత వ్యాధుల శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కంతేటి వెంకటరాజు, డీటీడీసీ బాబు, చెరుకువాడ రంగసాయి చెప్పారు. బుధవారం వైద్యశిబిరానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తారని ఈ శిబిరంలో విజయవాడ మణిపాల్ హాస్పిటల్స్, క్యాన్సర్ ఫౌండేషన్ తమ మొబైల్ యూనిట్‌తో బ్రెస్ట్ మమోగ్రఫీ, ప్యాప్ స్మియర్, గర్భాశయ ముఖ ద్వారానికి సంబంధించిన పరీక్షలు చేస్తారని తెలిపారు కార్యక్రమంలో పీఎస్ఎన్ రాజు, కడలి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నిధులు దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు



కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. ఇటీవల భీమవరం మండలం చినఅమిరం గ్రామ పంచాయతీ పూర్వ పంచాయతీ కార్యదర్శి ఎస్కేజీ కృష్ణంరాజు చిన అమిరం గ్రామ పంచాయతీలో పని చేసిన కాలంలో నిధులు దుర్వినియోగం చేశారని వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ కమిటీ నియమించామని వివరించారు. ఆ కమిటీ రూ.2,73,96,264/- ల నిధులను దుర్వినియోగం చేసినట్లు నివేదిక ఇచ్చిందని పేర్కొన్నారు. ఆ నివేదిక ఆధారంగా కృష్ణంరాజుపై క్రిమినల్ చర్యలు తీసుకునేందుకు అరెస్ట్ చేయాలని ఆదేశించామని తెలిపారు. ఈ కేసును నిరంతరం పర్యవేక్షిస్తున్నామని వివరించారు.

గాదిరాజు బాబు కుటుంబానికి ప్రముఖుల పరామర్శ

భీమవరం: భీమవరం డీఎన్నార్ కళాశాల సెక్రటరీ అండ్ కర్సపాండెంట్ గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు) కుటుంబసభ్యులను బుధవారం భీమవరం, ఆచంట మాజీ ఎమ్మెల్యేలు గ్రంధి శ్రీనివాస్, చెరుకువాడ శ్రీరంగనాథరాజు పరామర్శించారు. బాబు తండ్రి సోమరాజు మృతి చెందడంతో వారి ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఆ బైక్ ర్యాలీలో కనిపించని హెల్మెట్



భీమవరంలో హెల్మెట్ లేకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన బైక్ ర్యాలీలో పాల్గొన్న సిబ్బంది

భీమవరం: హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమంటూ ఓ పక్క పోలీసులు ప్రచారం చేస్తున్నా ప్రభుత్వం చేపట్టిన బైక్ ర్యాలీలో పాల్గొన్న మహిళలు హెల్మెట్ ధరించకపోవడం ప్రజలను ఆశ్చర్యానికి గురిచేసింది. సాక్షాత్తు కలెక్టర్, ఎమ్మెల్యే పాల్గొన్న కార్యక్రమంలోనే అధికారులు నిబంధనలు పాటించకపోవడం చర్చనీయాంశమైంది. భీమవరంలో బుధవారం బేటీ బఛావో-బేటీ పఢావో(ఆడపిల్లలను రక్షిద్దాం-ఆడపిల్లలను చదివిద్దాం) ప్రచార కార్యక్రమంలో భాగంగా మహిళలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. మహిళాభివృద్ధి, శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన బైక్ ర్యాలీ పట్టణంలోని పాతబస్టాండ్ దగ్గరలోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నుంచి జువ్వలపాలెం రోడ్డులోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వరకు సాగింది. ఈ బైక్‌ర్యాలీని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) జెండా ఊపి ప్రారంభించగా కలెక్టర్ చదలవాడ నాగరాణి స్వయంగా బైక్ నడుపుతూ ర్యాలీలో పాల్గొన్నారు. సుమారు రెండు కిలోమీటర్ల దూరం సాగిన బైక్‌ర్యాలీలో దాదాపు 100 మంది వరకు మహిళలు స్వయంగా బైక్‌లో నడుపుతూ పాల్గొన్నారు. అయితే బైక్ నడుపుతున్న మహిళలు కనీసం 10 మంది కూడా హెల్మెట్ ధరించకపోగా పోలీసులు, ఇతర శాఖల అధికారులు అస్సలు పట్టించుకోలేదు. సామాన్య ప్రజలు బైక్ నడిపేటపుడు హెల్మెట్ ధరించకపోతే జరిమానా విధించే పోలీసులు వారి సమక్షంలో జరిగిన బైక్ ర్యాలీలో హెల్మెట్ ధరింపచేయాలనే ఆలోచన లేకపోవడం పట్ల పలువురు విమర్శలు చేస్తున్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై సమీక్ష



మాట్లాడుతున్న కమిషనర్ కె.రామచంద్రారెడ్డి

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం పురపాలక సంఘం పరిధిలో 100 శాతం ప్లాస్టిక్ నిషేధం అమలు చేయాలని మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం భీమవరం పురపాలక సంఘ కార్యాలయంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు, శానిటేషన్ సెక్రటరీలకు, చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలో అన్ని రకాల ప్లాస్టిక్ కవర్లు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులపై పూర్తిస్థాయి నిషేధం ఉన్న కారణంగా విక్రయదారులు సదరు నిషేధిత వస్తువుల క్రయవిక్రయాలు జరపకూడదన్నారు. నిషేధించిన ప్లాస్టిక్ వస్తువుల స్థానంలో పర్యావరణహిత ప్రత్యామ్నాయ వస్తువులను ఉపయోగించాలని సూచించారు. ఈ విషయంలో చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులందరూ సహకరించాలని కోరారు.

పశువులకు సోకే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



తుందుర్రులో గొర్రెలకు నట్టల నివారణ మందును తాగిస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: పశువులకు సీజనల్‌గా సోకే వ్యాధుల పట్ల పశు పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశు వైద్యాధికారి మురళీకృష్ణ అన్నారు. భీమవరం మండలంలోని తుందుర్రు గ్రామంలో పశు సంవర్థక శాఖ, జిల్లా పశు గణాభివృద్ధి శాఖల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ మురళీ కృష్ణ మాట్లాడుతూ పశువులకు సోకే గాలి కుంటు, నట్టలు, గర్భకోశ తదితర సీజనల్ వ్యాధులకు ప్రభుత్వం అందించే పథకాలను పశు పెంపకందారులు సద్వినియోగం చేసుకుని పాడి అభివృద్ధి కృషి చేయాలన్నారు. అనంతరం 91 పశువులకు వివిధ రకాల వ్యాధులకు చికిత్స చేశారు. 40 దూడలకు, 200 గొర్రెలకు నట్టల నివారణ మందులను తాగించారు. ఈ కార్యక్రమంలో భీమవరం సబ్ డివిజన్, సహాయ సంచాలకులు డాక్టర్ పి. సుధీర్ బాబు, సర్పంచ్ ఆరేటి వీరాస్వామి నాయుడు, ఎంపీటీసీ సభ్యుడు ఆరేటి వాసు, కొట్టు సురేష్, భీమవరం, మత్స్యపురి పశువైద్యాధికారులు పి. పుండరీబాబు, మౌర్య సత్యేంద్ర, లలిత తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్ అవసరం

భీమవరం : ప్రతి విద్యార్థీ కమ్యూనికేషన్ స్కిల్స్ ను పెంపొందించుకోవాలని, కమ్యునికేషన్ స్కిల్స్ ఉంటే క్యాంపస్ డ్రైవ్ లో ఉద్యోగ అవకాశాలు సాధించవచ్చని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం డీఎన్నార్ కళాశాలలో ఉప్పలపాటి ఫౌండేషన్ వారి మెగా జాబ్ మేళా నిర్వహించారు. 23 కంపెనీలతో నిర్వహించిన జాబ్ మేళాలో 200 మందికి ఆయా కంపెనీలో ఉద్యోగ అవకాశాలను సాధించారు. వారికి జాయినింగ్ ఆర్డర్ పత్రాలను ఎమ్మెల్యే అంజిబాబు అందించి మాట్లాడారు. అడిషనల్ ఎస్పీ భీమారావు, డీఎన్నార్ కళాశాల ఉపాధ్యక్షుడు గోకరాజు పాండు రంగరాజు, ఉప్పలపాటి ఫౌండేషన్ చైర్మన్ ఉప్పలపాటి కాశీ విశ్వనాథరాజు పాల్గొన్నారు.

జంతువుల్ని, పక్షుల్ని కాపాడుకోవాలి



దుంపగడపలో పశు వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎంపీటీసీ నాగబాబు

ఆకివీడు : పశువుల్ని, పక్షుల్ని కాపాడుకోవాలని ఎంపీటీసీ బొర్రా నాగబాబు అన్నారు. ఆకివీడు మండలం దుంపగడప గ్రామంలో పశువైద్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటుచేసిన ఉచిత పశువైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. జంతువులు, పక్షుల వల్ల మనకు ఎంతో మేలు జరుగుతుందని, వాటిని హించించటం చట్టరీత్యానేరమని అన్నారు. మండల పశు వైద్యాధికారిణి కెల్లా భార్గవీ సత్య మాట్లాడుతూ అనారోగ్యంగా ఉన్న పశువులకు చికిత్స చేస్తున్నట్టు చెప్పారు. నట్టల నివారణకు మందులు వేస్తున్నామన్నారు. పశువుల్లో పారుడు నివారణకు పశువైద్యశాలలో చికిత్స చేయించాలన్నారు. శిబిరంలో గర్భకోశ చికిత్సలు 20, 40 పశువులకు, 20 గొర్రెలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఎల్ఎస్ఏ మోహన్, దుంపగడప, చెరుకుమిల్లి, అజ్జమూరు సహాయకులు మహేష్, మంజూష, అమూల్య రైతులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో డయాలసిస్ ప్రారంభం



స్థానిక సీహెచ్‌సీలో తొలి డయాలసిస్ ను పరిశీలిస్తున్న ఐఎంఏ వైద్యులు

ఆకివీడు : స్థానిక సీహెచ్‌సీ ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ ప్రక్రియ బుధవారం ప్రాంభమైంది. మొదటి రోగికి డయాలిసిస్‌ను విజయవంతంగా నిర్వహించారు. మండలంలోని చెరుకుమిల్లి గ్రామానికి చెందిన డాక్టర్ దాట్ల సత్యనారాయణరాజు ఆర్థిక సహకారంతో నాలుగు డయాలసిస్ యంత్రాలను ఏర్పాటుచేసినట్టు డయాలసిస్ యూనిట్ ఇన్‌చార్జి డాక్టర్ ఎండీ బిలాల్ తెలిపారు. ఆకివీడు ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ చేసే ప్రక్రియ ప్రారంభమైందని చెప్పారు. ఈ ప్రాంతంలోని కిడ్నీ వ్యాధిగ్రస్తులు 30 మంది తమ పేర్లను ఆసుపత్రిలో నమోదు చేయించుకున్నట్టు తెలిపారు. వారికి అవసరాన్ని బట్టి డయాలసిస్ చేసే తేదీలను వెల్లడిస్తామని చెప్పారు. భీమవరానికి చెందిన ప్రముఖ వైద్యులు, నెఫ్రాలజిస్టు అశోక్ వర్మ ఆధ్వర్యంలో డయాలసిస్ చేస్తామని తెలిపారు. డయాలసిస్ ప్రారంభ కార్యక్రమాన్ని ఐఎంఏ వైద్య బృందం పరిశీలించిందన్నారు.

అపూర్వ కలయిక



ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో పూర్వ విద్యార్థులు

భీమవరం: స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యనభ్యసించిన 25 ఏళ్ల నాటి పాత మిత్రులంతా బుధవారం 25 వసంతాల వేడుకను ఘనంగా నిర్వహించారు. వివిధ దేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్న ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ బ్రాంచ్ 1995–1999 బ్యాచ్ విద్యార్థులు పాత జ్ఞాపకాలను నెమరువేసుకోడానికి, గురువుల సత్కరించుకోవాలని భావించారు. దీనితో కళాశాలను వేదికగా చేసుకుని అమెరికా, ఇంగ్లాండ్, జర్మనీ దేశాలతో పాటు భారతదేశంలో కూడా వివిధ రాష్ట్రాల్లో స్థిరపడిన వారంతా రెక్కలు కట్టుకుని వాలిపోయారు. తమకు విద్యాభోజన చేసిన గురువులను సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు, కళాశాల ఉపాధ్యక్షుడు సాగి విఠల్‌రంగరాజు, ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

సురభి నాటకోత్సవాలు

ఉండి: మండలంలోని కోలమూరు గ్రామంలో 20వ తేదీన ప్రారంభమైన సురభి నాటకోత్సవాలు కనుల పండువగా సాగుతున్నాయి. గ్రామానికి చెందిన సంతాన గోపాలస్వామి ఆలయ ఆధ్వర్యంలో టీటీడీ సౌజన్యంతో నిర్వహిస్తున్న నాటకోత్సవాల్లో భాగంగా మూడో రోజు బుధవారం లవకుశ నాటకాన్ని ప్రదర్శించారు. గురువారం నాటకోత్సవాలకు చివరి రోజు శ్రీనివాసకళ్యాణం నాటకాన్ని ప్రదర్శించనున్నట్టు నిర్వహకులు తెలిపారు. అభిమానులు తరలివచ్చి నాటకాన్ని తిలకించాలని కోరారు.

బాలిక ఆచూకీ గుర్తింపు

భీమవరం: పరిచయస్తుడి మాటలు నమ్మి ఇంటి నుంచి వెళ్లిన మైనర్ బాలికను పోలీసులు పట్టుకుని తల్లిదండ్రులు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన మైనర్ బాలిక ఆచూకీ ఈ నెల 17 నుంచి కనిపించలేదు. బంధువుల ఇళ్ల దగ్గర, చుట్టుపక్కల వెతికినా అనంతరం మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో బాలిక తల్లిదండ్రులకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆదేశాలతో సీఐ ఎం.నాగరాజు పర్యవేక్షణలో ఎస్సై కిరణకుమార్, సిబ్బంది బాలిక మొబైల్ లొకేషన్, ప్రత్యేక ఇంటిలిజెన్స్ సమాచారంతో పాలకొల్లు సమీపంలోని బస్టాప్ దగ్గర రాత్రి 1 గంటకు బాలికను గుర్తించి ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. తెలియని వ్యక్తి రమ్మనగానే వెళ్లగా, వెనక్కి వెళ్లకుండా నిర్బంధించినట్లు విచారణలో బాలిక చెప్పింది. పిల్లల పట్ల తల్లిదండ్రుల పర్యవేక్షణ అనుక్షణం ఉండాలని పోలీసులు సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భీమవరం: ఉండి–దువ్వ ఫీడర్‌లో సర్క్యూట్ బ్రేకర్ మరమ్మతులు కారణంగా గురువారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.వెంకటేశ్వరరావు బుధవారం ఒకప్రకటనలో తెలిపారు. ఉండి 220/132/33 కేవీఈహెచ్‌టీ విద్యుత్ సబ్‌స్టేషన్ భీమవరం డివిజన్ ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని భీమవరం అర్బన్, భీమవరం రూరల్, పాలకోడేరు, ఉండి, ఆకివీడు, వీరవాసరం, కాళ్ల మండలాల్లో గురువారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని వినియోగదారులు సహకరించాలని వెంకటేశ్వరరావు కోరారు.